ఇస్లాం
మూల స్థంభాలు
నెం.4

రమజాన్ నెల ఉపవాసాలు



శాంతిమార్గం పబ్లికేషన్ & చారిటబుల్ ట్రస్ట్ (రిజిష్టర్డ్ నెం.406/2013)
హైదరాబాద్

https://teluguislam.net

విన్నపం

ఈ పుస్తకంపై మీ సలహాలు, సూచనలను ఈ క్రింద తెలుపబడిన చిరునామాకు లేదా ఈ-మెయిల్‌కు పంపించ మనవి. మీ అమూల్యమైన సలహాలను మలి ముద్రణలో పరిగణనలోకి తీసుకోవటం జరుగుతుంది.

హాఫిజ్ ఎస్.ఎం. రసూల్ షర్ఫీ

16-2-867/10, అక్బర్‌బాగ్, సయీదాబాద్, హైదరాబాద్- 59.

సెల్ : **9676144697**

E-mail: shantimargam@gmail.com

https://teluguislam.net

ఇస్లాం
మూల స్థంభాలు

రమజాన్ నెల ఉపవాసాలు



మూలం
సఫీర్ పబ్లికేషన్స్

అనువాదం
సయ్యద్ హుస్సేన్

శాంతిమార్గం పబ్లికేషన్ & చారిటబుల్ ట్రస్ట్
(రిజిష్టర్డ్ నెం.406/2013)
హైదరాబాద్

https://teluguislam.net

RAMADAN NELA UPAVASALU (FASTING IN RAMADAN) (Telugu)

Prepared by : Safeer Publications

Telugu Translation : Syed Hussain

Edited by : Manzoor Ahmed Umari
S.M.Rasool Sharfi

© All Rights Reserved with Publishers

First Edition : August 2009

6th Edition : June 2014

Copies : 3000

Hadya : Fee Sabeelillah (Free)

Designing : *Sana Ad*vertising Agency, *Ph: 9985359515.*

DTP & Printing : Al-Baseer Graphics,
Hyderabad, Ph: 9441055065 (A.Vakeel)

Published by : **Shanti Margam Publication & Charitable Trust (Regd. No.406/2013)**
Jah Manzil, Beside Quadria Masjid
Sayeedabad Colony, Hyderabad.
Cell : 9676144697, 7386785012
E-mail: shantimargam@gmail.com

https://teluguislam.net

రమజాన్ నెల

ముస్లింలు ప్రతి సంవత్సరం ఉపవాసాలు పాటించే నెల రమజాన్ నెల. ఇది అల్లాహ్ దృష్టిలో అన్ని నెలల కంటే శ్రేష్ఠమైనది. ఈ నెలలోనే ఇబ్రాహీమ్, మూసా, ఈసా ప్రవక్తలకు (అల్లాహ్ వారందరిపై శాంతిని కురిపించు గాక!) దివ్య గ్రంథాలు ప్రసాదించబడ్డాయి. ఈ నెలలోనే ఒక ప్రత్యేకమైన రాత్రి ఉంది. దాన్ని "లైలతుల్ ఖద్ర్" (ఘనమైన రాత్రి) అంటారు. ప్రవక్త ముహమ్మద్ (అల్లాహ్ ఆయనపై శాంతీ కారుణ్యాలు కురిపించు గాక!) పై మొట్టమొదటి సారిగా దివ్యఖుర్ఆన్ గ్రంథం అవతరించింది ఈ రాత్రిలోనే.

పూర్వకాలంలోని ముస్లింలకు అల్లాహ్ ఈ నెలలో ఎన్నో విజయాలను చేకూర్చి పెట్టాడు. ఉదాహరణకు దైవప్రవక్త ముహమ్మద్ (స) మక్కా నుంచి మదీనాకు ఈ నెలలోనే వలస వెళ్ళారు. ఆ మరుసటి యేడు ముస్లింలకు దైవవిరోధులతో యుద్ధం చేయవలసి వచ్చింది. ఈ యుద్ధాన్నే "బద్ర్ యుద్ధం" అంటారు. బద్ర్ యుద్ధం జరిగింది రమజాన్ నెలలోనే. ముస్లింలు ఈ యుద్ధంలో దైవవిరోధులపై అపూర్వ విజయం సాధించారు. ఆ పిదప హిజ్రీ ఎనిమిదవ సంవత్సరం రమజాన్ నెలలో ముస్లింలకు మరో అద్భుత విజయం వరించింది. దీనినే "మక్కా విజయం" అంటారు. ఈ విజయం తరువాత ప్రజలు తండోప తండాలుగా అల్లాహ్ ధర్మమైన ఇస్లాంలోకి అడుగు పెట్టారు.



https://teluguislam.net

రమజాన్ నెలపొడుపు

దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు :

"రమజాన్ నెల - ఖుర్ఆన్ అవతరించిన నెల. అది (ఖుర్ఆన్) మానవులందరికీ మార్గం చూపిస్తుంది. సన్మార్గంతో పాటు, సత్యాసత్యాలను వేరుపరచే స్పష్టమైన విషయాలు అందులో ఉన్నాయి. కనుక మీలో ఎవరు ఈ (రమజాన్) నెల (మొదటి రాత్రిన నెల పొడుపు)ను చూస్తారో వారు తప్పకుండా ఉపవాసాలుండాలి." (దివ్య ఖుర్ఆన్ 2 : 185)

షాబాన్ నెల 29వ తేదీనాడు సూర్యుడు అస్తమించిన తరువాత నెలపొడుపు కనిపించటంతో రమజాన్ నెల మొదలవుతుంది. ఒకవేళ 29వ తేదీనాడు నెలవంక కనిపించకపోతే మరుసటి రోజు (అంటే షాబాన్ నెల 30వ తేదీన) నెలపొడుపు కనిపించాక ఈ నెల ఆరంభ మవుతుంది. ఆపై షవ్వాల్ నెలవంక చూశాక రమజాన్ నెల ముగుస్తుంది.

ఓ కథనం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రబోధించారు: "నెలవంక చూసి మీ ఉపవాసాలను మొదలుపెట్టండి. మళ్ళీ మరుసటి నెలవంక చూశాక మీ ఉపవాసాలు విరమించండి. ఒకవేళ (మొదట్లో) చంద్రుడు కనిపించకపోతే షాబాన్ నెల 30 రోజులు పూర్తిచెయ్యండి."

సాధారణంగా ప్రజలు స్వయంగానే నెలపొడుపును చూసి రమజాన్ మాసపు తేదీలను పరిగణించుకుంటారు. అయితే ప్రస్తుత కాలంలో ముస్లింలు నెలపొడుపు నిర్ధారణ కోసం నక్షత్రశాలలపై కూడా ఆధారపడుతున్నారు.



https://teluguislam.net

రమజాన్ నెల ఉపవాసాలు

రమజాన్ నెల ఉపవాసాలు - ఇస్లాం ధర్మం ప్రకారం - ప్రతి ముస్లిం తప్పనిసరిగా పాటించవలసినవి. ముస్లింలపై అల్లాహ్ విధిగా చేసిన ఐదు ప్రధాన అంశాల్లో రమజాన్ నెల ఉపవాసాలు కూడా ఉన్నాయి. దైవప్రవక్త ముహమ్మద్ (స) మక్కా నుంచి మదీనాకు హిజ్రత్ చేసి (వలస) వెళ్ళిన మరుసటి యేడు ముస్లింలపై ఈ ఉపవాసాలు విధి అయ్యాయి.

ఖుర్ఆన్‌లో ఇలా ఉంది : " విశ్వసించిన ఓ ప్రజలారా! ఉపవాసాలు పాటించటం మీపై విధిగా నిర్ణయించబడింది - మీ పూర్వీకులపై కూడా ఇదే విధంగా ఉపవాసం విధించబడింది. దీనివల్ల మీలో భయభక్తులు పెంపొందే అవకాశం ఉంది." (దివ్య ఖుర్ఆన్ 2 : 183)

ఈ నెల ఎంతో గౌరవప్రదమైనది. ఈ నెలలో ముస్లింలు ప్రతిరోజూ ఉషోదయం నుంచి సూర్యాస్తమయం వరకు తినటానికి, త్రాగటానికి, ఇంకా భార్యా భర్తల శారీరక సంబంధాలకు దూరంగా వుంటారు. ఎందుకంటే, అల్లాహ్ ఇలా ఆజ్ఞాపించాడు కదా!:

" నడిరేయి నల్లని చారలో నుండి తొలిజాములోని తెలుపు ప్రస్ఫుటం అయ్యే వరకూ తినండి, త్రాగండి. ఆ తరువాత (వీటన్నింటినీ త్యజించి) రాత్రి చీకటి పడేవరకూ ఉపవాసం ఉండండి."
(దివ్య ఖుర్ఆన్ 2 : 187)



https://teluguislam.net

తప్పనిసరిగా ఉపవాసం పాటించవలసిన వారు



- ముస్లిం అయి ఉండాలి.
- ఆరోగ్యవంతమైన మానసిక స్థితి కలిగి వుండాలి.
- యుక్త వయస్సుకు చేరినవారై ఉండాలి.
- ప్రయాణీకులు కానివారై ఉండాలి.
- ఉపవాసం ఉండటానికి శారీరకంగా శక్తి కలిగినవారై ఉండాలి.

పై లక్షణాలు కలిగినవారు రమజాన్ నెల మొత్తం తప్పనిసరిగా ఉపవాసం పాటించాలి.

- చిన్న పిల్లలు కూడా ఈ రమజాన్ నెలలో తమ శక్తి మేరకు కనీసం కొన్ని రోజులైనా ఉపవాసం పాటించడం మంచిది. ఇలా చేయటం వలన బాల్యం నుంచే వారికి ఉపవాసం పాటించే అలవాటు పడుతుంది.

https://teluguislam.net

ఉపవాసాన్ని భంగపరిచే పనులు

◆ కావాలని వాంతి చేసుకోవటం

◆ పగలు కావాలని తినటం, త్రాగడం

ఉపవాస సమయంలోనూ ఈ పనులు చేయవచ్చు

◆ ఉపవాస సమయంలో నోరు పుక్కిలించుకోవచ్చు, ముక్కును నీటితో శుభ్రం చేసుకోవచ్చు.

◆ స్నానం చేయవచ్చు.

◆ నరంలోకి గాని, చర్మం క్రింద గాని ఇంజెక్షన్ తీసుకోవచ్చు.

◆ కంట్లో చుక్కల మందు వేసుకోవచ్చు.

https://teluguislam.net

దైవప్రవక్త (స) చెప్పిన ప్రకారమే ఉపవాసం పాటించాలి

◆ ఉపవాసం ఉద్దేశం ఆకలితో బాధపడటం కాదు. ఎంత ఆకలిని భరిస్తే అంత పుణ్యం వస్తుందని అనుకోవటం పొరపాటు. అందుకని రోజల్లా ఉపవాసం ఉండి సాయంత్రం ఉపవాసాన్ని విరమించే సమయం వచ్చినప్పుడు, ఇక ఇఫ్తార్ (ఉపవాస విరమణ)లో ఏమాత్రం ఆలస్యం చేయకూడదు. స్త్రీలు, పురుషులు, పిన్నలు, పెద్దలందరూ కూడా సూర్యాస్తమయం అయిన వెంటనే ఉపవాసాన్ని విరమించాలి.

◆ ఉపవాస సమయంలో చెడుగా మాట్లాడరాదు. తిట్లు, చీవాట్లు, తగాదాలను మానుకోవాలి. పాడు పనులకు దూరంగా ఉండాలి. ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రబోధించారు: ఉపవాసం అంటే కేవలం అన్నపానీయాలను మానుకోవటం మాత్రమే కాదు. మన నోటి ద్వారా వ్యర్థమైన మాటలు, అశ్లీల పదాలు దొర్లకుండా జాగ్రత్తపడటం కూడా ఉపవాసంలో భాగమే. ఎవరైనా మీతో తగాదాపడినా, మీకు కోపం తెప్పించినా వారితో, "నేను ఉపవాసం ఉన్నాను" అని మృదువుగా పలకాలి.

◆ సహరీ భోజనాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. సహరీ అంటే ఉపవాస దీక్షను ప్రారంభించడానికి ఉషోదయం వేళ భుజించే ఆహారం. అర్ధరాత్రి చివరి నుంచి ఉషోదయానికి ముందు వరకు ఎప్పుడైనా సహరీ భుజించవచ్చు. సహరీ చేయడం వలన శరీరానికి శక్తి లభిస్తుంది. అన్నపానీయాలు తీసుకోకుండా ఉపవాసం మొదలుపెడితే పగలంతా నీరసంగా ఉంటుంది. పగటిపూట అల్లాహ్ ఆరాధనలో చురుకుగా ఉండాలంటే సహరీ భుజించాలి మరి! ఓ కథనం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా చెప్పివున్నారు : "సహరీలో ఆలస్యం చేయడం మంచిది." (అంటే ఉషోదయం వరకు ఆలస్యంగా తినటం ఉత్తమం అన్నమాట).

◆ ఉపవాసం విరమించిన తరువాత దైవప్రవక్త ముహమ్మద్ (స) నేర్పిన ఈ కృతజ్ఞతా పూర్వకమైన పలుకులు ఉచ్చరించాలి:

"జహబ జ్జమవు వబ్‌తల్లతిల్ ఉరూఖు వ సబతల్ అజ్రు ఇన్నా అల్లాహ్" (దాహం తీరింది. నరాలు తడిచాయి. అల్లాహ్ దయదలిస్తే ప్రతిఫలం కూడా ప్రాప్తమవుతుంది).

ఉపవాస సమయంలో మనిషి తరచూ ఖుర్‌ఆన్ పఠిస్తూ ఉండాలి. నిరంతరం అల్లాహ్‌ను జ్ఞాపకం చేసుకుంటూ ఉండాలి. దానధర్మాలు చేస్తుండాలి.

https://teluguislam.net

వీరు ఉపవాసం పాటించకపోయినా ఫర్వాలేదు

- ప్రయాణీకులు

- వ్యాధిగ్రస్తులు

- గర్భవతులు, చంటి పిల్లలకు పాలుపట్టే స్త్రీలు
(ఉపవాసం పాటించటం వల్ల తమకు గాని తమ పిల్లలకు గాని హాని జరగవచ్చున్న భయం ఉంటే వారు ఉపవాసం మానుకోవచ్చు).

- ఉపవాసం పాటించలేనంత బలహీనులైన వృద్ధులు.

- రుతుస్రావంలో ఉన్న స్త్రీలు, బాలింతలు.

https://teluguislam.net

- అనారోగ్యం, ప్రయాణం, గర్భవతిగా ఉండటం, బాలింతగా ఉండటం మొదలగు బలమైన కారణాల వలన స్త్రీ పురుషులు ఎవరైనా రమజాన్ నెలలో ఉపవాసాలు పాటించకపోతే రమజాన్ నెల అయిపోయిన తరువాత వారు ఈ తప్పిపోయిన ఉపవాసాలను విధిగా పూర్తి చేయాలి. ఇలా తప్పిపోయిన ఉపవాసాలను తిరిగి పాటించడాన్ని "ఖజా" అంటారు.

- అయితే మరీ ముసలితనం మూలంగానో లేక కోలుకోలేనంత అనారోగ్యానికి గురయ్యో ఉపవాసం పాటించనివారు రమజాన్ నెల తర్వాత కూడా తప్పిపోయిన ఉపవాసాలను పాటించటానికి వీలుకాదు కదా! కనుక వారు అందుకు "ఫిదియా" (పరిహారం) చెల్లించుకోవచ్చు. ఆ పరిహారం ఏమిటంటే తప్పిపోయిన ఒక్కో ఉపవాసానికి బదులుగా ఓ నిరుపేదకు అన్నంపెట్టాలి. సాధారణంగా తమ ఇంట్లో సభ్యులు ఏం భోజనం తింటారో అది పెడితే చాలు. దానికోసం ప్రత్యేకంగా పరమాన్నాలు వండిపెట్టవలసిన అవసరం ఏమీ లేదు.

https://teluguislam.net

రమజాన్ ఉపవాసాలు పాటించటం తప్పనిసరి అని అర్థమయింది కదా?! అయితే రమజాన్ ఉపవాసాల మాదిరి విధిగా కాకుండా తమ ఇష్టం కొద్ది పాటించే ఉపవాసాలు కూడా కొన్ని ఉన్నాయి. రమజాన్ మాసంలో పాటించబడే ఉపవాసాల మాదిరిగా ఇవి కూడా, దాసులు అల్లాహ్‌కు అత్యంత సన్నిహితులు కావటానికి ఉపకరిస్తాయి. కాకపోతే ఈ ఉపవాసాలను పాటించటం విధి మాత్రం కాదు. ప్రవక్త ముహమ్మద్ (స) ఇలాంటి కొన్ని ఉపవాసాలను తరచూ పాటిస్తుండేవారు. తన అనుచరులను కూడా ఆ ప్రత్యేక దినాల్లో ఉపవాసాలు పాటించమని ప్రోత్సహిస్తూ ఉండేవారు. వాటిలో కొన్ని:

- ప్రతి సోమవారం, గురువారం
- 'అరఫాత్' రోజున (అంటే జిల్‌హజ్ మాసంలో 9వ తేదీన). అయితే హజ్ యాత్ర చేస్తూ ఉండనివారు మాత్రమే దీన్ని పాటించాలి.
- చాంద్రమానం ప్రకారం ఇస్లామీయ నెలలోని ప్రతి 13, 14 , 15వ తేదీలలో.
- 'ఆషురా' రోజు (ముహర్రం నెల 10వ రోజు)
- రమజాన్ నెల తర్వాత షవ్వాల్ నెలలో ఆరు రోజులు.



ఈ క్రింది రోజుల్లో ఉపవాసం పాటించరాదు

- సాధారణంగా ఉపవాస దీక్ష పాటించే క్రమంలో శుక్రవారం వస్తే తప్ప - ప్రత్యేకంగా శుక్రవారాల్లోనే ఉపవాసం పాటించడం అభిలషణీయం కాదు.
- ఈదుల్ ఫిత్ర్ (రమజాన్ పండుగ) నాడు.
- ఈదుల్ అజ్‌హా (బక్రీద్ పండుగ) నాడు.

https://teluguislam.net

ఉపవాసం వలన లాభాలు

- సహనం, ఓర్పు అలవడతాయి.
- శారీరకంగా శక్తి లభించటమే గాకుండా కొన్ని రోగాలు కూడా నయమవుతాయి.
- జీర్ణవ్యవస్థకు కొంత విశ్రాంతి లభిస్తుంది.
- బీదల పట్ల సానుభూతి చూపుతూ, వారికి సహాయం చేసే అవకాశం లభిస్తుంది.
- తినటం, త్రాగటంలో ఓ క్రమపద్ధతి అలవడుతుంది.
- అల్లాహ్ వద్ద అనేక రెట్లు ప్రతిఫలం లభిస్తుంది.

https://teluguislam.net

తరావీహ్ నమాజ్

రమజాన్ నెలలో ప్రతి రోజూ ఇషా నమాజ్ తరువాత తరావీహ్ నమాజు చేయాలి. దైవప్రవక్త ముహమ్మద్ (స) ఈ నమాజు చేసేవారు. ఓ కథనం ప్రకారం ఆయన (స) ఇలా ప్రవచించారు :

"ఎవరయితే విశ్వాసంతో, పుణ్యం లభిస్తుందనే ఆశతో రమజాన్ మాసంలోని రాత్రులు అల్లాహ్ ఆరాధనలో గడుపుతారో వారి గత పాపాలన్నీ క్షమించబడతాయి."

తరావీహ్ నమాజు సమయం

ఇషా నమాజు తరువాత నుంచి ఉషోదయం జరిగేలోపు వరకు ఎప్పుడైనా ఈ నమాజ్‌ను ఆచరించవచ్చు.

రకాతుల సంఖ్య

తరావీహ్ నమాజు 8 రకాతులు. వితర్ నమాజుతో కలిపి మొత్తం 11 రకాతులు నమాజ్ చేయాలి. సాధారణంగా తరావీహ్ నమాజు 20 రకాతులు చేసే ఆనవాయితీ కూడా ఉంది. అయితే అది కూడా 8 రకాతుల తర్వాత మిగిలిన 12 రకాతులు నఫిల్ సంకల్పంతో మాత్రమే చేయటం జరుగుతుంది.

మొత్తానికి అసలు తరావీహ్ నమాజు 8 రకాతులేనని ప్రామాణికమైన హదీసుల ద్వారా తెలుస్తోంది. ఏది ఏమైనా శుభప్రదమైన రమజాన్ నెలలో తరావీహ్ నమాజ్ రకాతుల సంఖ్య గురించి కొట్లాడుకోవటం అవివేకం. నిజానిజాలను తెలుసుకోవాలంటే హదీసులను అధ్యయనం చెయ్యాలి.

చేసే విధానం

తరావీహ్ నమాజ్‌ను రెండేసి రకాతులుగా చేయాలి. ప్రతి రకాతులో ఫాతిహా సూరాతో పాటు ఖుర్‌ఆన్‌లోని ఏదైనా భాగాన్ని పఠించవచ్చు. ప్రతి నాలుగు రకాతుల మధ్య కొంత విశ్రాంతి తీసుకోవాలి. మస్జిద్‌లో దీన్ని సామూహికంగా ఆచరిస్తారు.

https://teluguislam.net

ఫిత్రా దానం

రమజాన్ చివర్లో ఫిత్రాదానం చెల్లించాలి. ముస్లింలలో పెద్దలు, పిన్నలు, స్త్రీలు పురుషులు అన్న తేడా లేకుండా తగిన స్థోమత ఉన్న ప్రతి ఒక్కరూ విధిగా చెల్లించవలసిన దానం ఇది. కేవలం తన తరపునే కాదు, తన అధీనంలో, తన పోషణలో, తన పర్యవేక్షణలో వున్న ప్రతి ఒక్కరి తరపున ఫిత్రాను చెల్లించాల్సిన బాధ్యత కూడా ఒక ముస్లింపై ఉంటుంది.



విధిగా చెల్లించవలసిన దానమిది

ఒక పగలు, ఒక రేయికి సరిపడ ఆహార అవసరాలకు మించి స్థోమత వున్న ప్రతి ఒక్కరూ ఫిత్రా దానం చెల్లించాలి.

చెల్లించవలసిన సమయం

రమజాన్ పండుగకు ముందే దీన్ని చెల్లించాలి.ఒకవేళ పండుగ నమాజ్ తరువాత దీన్ని చెల్లించినట్లైతే అది కేవలం దానంగా మాత్రమే పరిగణించ బడుతుంది. దాన్ని ఫిత్రాగా భావించరు.

ఎవరికి చెల్లించాలి?

రమజాన్ నెల పూర్తయిన తర్వాత తొలి రోజు ముస్లింలు పండుగ జరుపుకుంటారు. దీన్నే "ఫిత్ర్ పండుగ" అంటారు. ఆ పండుగ నాడు కూడా సరిపడ ఆహారం లేని నిరుపేదలు ఫిత్రా దానం పుచ్చుకోవటానికి అర్హులు. అటువంటి అభాగ్యులకు ఫిత్రా దానం చెల్లించి వారిని సంతోషపెట్టాలి. ధనిక, పేద ముస్లింల మధ్య సానుభూతిని, ప్రేమానురాగాలను సాధించి చూపటమే దీని ప్రధాన ఉద్దేశం.

ఎంత చెల్లించాలి?

దీని పరిమాణం ఒక 'సా' గోధుమలు, బార్లీ, ఖర్జూరాలు, ధాన్యం లేక బియ్యం. ఒక 'సా' అంటే దాదాపు 2 కిలోల 600 గ్రాములకు సమానం. అవసరాన్ని బట్టి దీన్ని నగదు రూపంలో కూడా చెల్లించ వచ్చు.

https://teluguislam.net

లైలతుల్ ఖద్ర్ (ఘనమైన రాత్రి)

రమజాన్ మాసపు మూడవ దశకంలో బేసి సంఖ్యగల రాత్రులలో (అంటే 21, 23, 25, 27, 29 రాత్రుల్లో) ఏదో ఒకటి లైలతుల్ ఖద్ర్ (ఘనమైన రాత్రి) అవుతుంది. మొత్తం సంవత్సరంలోనే ఈ రాత్రి శుభప్రదమైనది. రమజాన్ మాసంలోని ఈ చివరి పది రోజులూ ప్రవక్త ముహమ్మద్ (స) అల్లాహ్ ఆరాధనలో గడపడానికి రెట్టింపు శక్తితో సమాయత్తమయ్యేవారు. దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఈ రాత్రి గురించి ఏం చెప్పాడో తెలుసుకుంటే ఆ రాత్రి ఎంతటి అపూర్వమైనదో అర్థమవుతుంది:

"నిశ్చయంగా మేము దీనిని (ఈ ఖుర్ఆనును) ఘనమైన రాత్రి యందు అవతరింపజేశాము. ఘనమైన రాత్రి గురించి నువ్వేమను కున్నావు? ఘనమైన రాత్రి వెయ్యి నెలల కంటే కూడా మేలైనది. ఆ రాత్రి యందు దైవదూతలు, ఆత్మ (జిబ్రయీల్) తమ ప్రభువు ఉత్తర్వుపై సమస్త విషయాల (నిర్వహణ) నిమిత్తం (దివి నుంచి భువికి) దిగివస్తారు. ఆ రాత్రి ఆసాంతం శాంతియుత మైనది - తెల్లవారే వరకూ (అది ఉంటుంది)." (దివ్య ఖుర్ఆన్ 97 : 1-5)

నమాజుల్లో, ప్రార్థనల్లో, అల్లాహ్ స్మరణలో, గతంలో జరిగిన పాపాలకు క్షమాభిక్ష వేడుకుంటూ ఈ ఘనమైన (ఖద్ర్) రేయి మొత్తం గడపటం ఉత్తమం. ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు :

"ఎవరైతే పరిపూర్ణ విశ్వాసంతో, పుణ్యం లభిస్తుందన్న ఆశతో లైలతుల్ ఖద్ర్ నాడు (అల్లాహ్‌ను ఆరాధిస్తూ) గడుపుతారో వారి గత పాపాలన్నీ క్షమించబడతాయి."

https://teluguislam.net

ఫిత్ర్ పండుగ నమాజు



ఫిత్ర్ పండుగ నమాజు ప్రవక్త ముహమ్మద్ (స) వారి ఖచ్చితమైన సంప్రదాయం (సున్నతె ముఅక్కదా). దీనిని రమజాన్ నెల ముగిసిన వెంటనే మరుసటి రోజు, అంటే షవ్వాల్ మొదటి తేదీన చేస్తారు. సూర్యోదయం అయిన ఇరవై నిముషాల తరువాత నుంచి మధ్యాహ్నం జుహర్ నమాజ్‌కు లోపు ఈ నమాజ్‌ను ఆచరించవచ్చు. పెద్ద విశాలమైన ప్రదేశంలో ఈ నమాజ్ చేయటం ఉత్తమం. ఒకవేళ అలాంటి సౌకర్యం లేకపోతే, లేక వర్షం పడుతున్నట్లయితే లేక వాతావరణం సరిగా లేకపోయినట్లయితే మస్జిద్‌లోనూ పండుగ నమాజును నెరవేర్చవచ్చు. ఉపవాస విధిని నిర్వర్తించినందుకు, ముస్లింల మధ్య ప్రేమానురాగాలు జనించేందుకు ప్రపంచంలోని ముస్లింలందరూ ఐకమత్యంతో ఆనంద సంబరాలు జరుపుకునే శుభదినమే ఫిత్ర్ పండుగ.

పండుగ నమాజ్‌లో ఇమామ్ (నమాజులో సారధిగా ఉన్న వ్యక్తి) ముస్లింలకు నాయకత్వం వహిస్తారు. ఈ నమాజు రెండు రకాతులు చేస్తారు. (అల్లాహ్ సన్నిధిలో ముందు కాసేపు నిటారుగా నిలబడటం, ఆ తర్వాత కొద్ది సేపు వంగి వుండటం, ఆ తర్వాత రెండుసార్లు సాష్టాంగ ప్రణామాలు చేయటం - మొత్తం కలిపి ఒక రకాత్‌గా భావించ బడుతుంది). ఈ విధంగా పండుగ నమాజులో రెండు రకాతులు ఉంటాయన్న మాట! ఇమామ్, “అల్లాహు అక్బర్” (అల్లాహ్ అందరికంటే గొప్పవాడు) అని నమాజ్ ప్రారంభిస్తారు. తర్వాత మొదటి రకాతులోనే ‘అల్లాహు అక్బర్’ అని అదనంగా ఏడుసార్లు పలికిన తరువాత ఖుర్ఆన్ మొదటి అధ్యాయమైన ఫాతిహా సూరా, దానితో పాటు ఖుర్ఆన్‌లోని మరి కొన్ని వాక్యాలు చదువుతారు. రెండు సాష్టాంగ ప్రణామా (సజ్దా)లతో మొదటి రకాతు పూర్తవుతుంది. ఆపై ఇమాము, “అల్లాహు అక్బర్” అంటూ రెండవ రకాతు కోసం లేచి నిలుచొని అదనంగా మరో ఐదు సార్లు “అల్లాహు అక్బర్” అంటారు. ఇమాము వెనుక జనం కూడా ఆయన్ని అనుసరిస్తూ నమాజ్ చేస్తారు. రెండు రకాతుల నమాజ్ ముగిశాక ఇమామ్‌గారు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

పండుగ రోజు ముస్లింలు శుభ్రమైన, మంచి దుస్తుల్ని ధరిస్తారు. పేదల పట్ల ప్రత్యేకంగా దయ చూపుతారు. బంధువులతో, స్నేహితులతో కలసి ఆనందిస్తారు. ధర్మం అనుమతించే పద్ధతిలో, సంతోషకరమైన వాతావరణంలో రోజంతా హాయిగా గడుపుతారు.

https://teluguislam.net

శ్రేయోభిలాషులకు మనవి

ఈ పుస్తకాన్ని కనీసం 500 కాపీలు లేదా 1000, 1500, 2000 ఇలా ఎన్ని కాపీలైనా ముద్రించి దైవమార్గంలో ఉచితంగా పంచిపెట్టాలని కోరుతున్న శ్రేయోభిలాషులు వివరాల కోసం **"శాంతి మార్గం పబ్లికేషన్ ట్రస్టు"** వారిని సంప్రదించగలరు.

సెల్ : **9676144697**

E-mail: shantimargam@gmail.com

https://teluguislam.net

పసితనం నుంచే పిల్లల్లో ధర్మజ్ఞానాన్ని పెంపొందింపజేయడం ఈ పుస్తక పరంపర (ఇస్లాం మూల స్థంభాల) ప్రధాన ఉద్దేశం.

అందమైన బొమ్మలతో, ఆహ్లాదపరిచే రంగులతో ఇస్లాం ధర్మ ప్రాధమిక విషయాలను సులభశైలిలో హాయిగా, ప్రశాంతంగా సాగే వివరణలతో రూపొందించబడిన ఈ చిరు పుస్తకాలు పసి పిల్లల హృదయాల్లో ఇస్లాం పట్ల అభిమానాన్ని కలుగజేస్తాయని ఆశించబడుతోంది.

Shanti Margam Publication & Charitable Trust
Jah Manzil, Beside Quadria Masjid, Sayeedabad Colony, Hyderabad
Cell : 9676144697, 7386785012 , E-mail: shantimargam@gmail.com

https://teluguislam.net